


## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

లింగాలఘనపురం, అక్టోబర్ 19: పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. మండలంలోని నెల్లుట్లలోని రామలింగేశ్వర జిన్నింగ్ మిల్లులో శనివారం సీసీఐ ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. మిల్లులో రైతులు తీసుకొచ్చిన పత్తిని మిషన్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావు నాయక్ మాట్లాడుతూ పొడవు పింజ గల పత్తికి ప్రభుత్వం మద్దతు ధరతో కలిపి క్వింటాల్‌కు రూ.7,521, మధ్యస్థ పింజ గల పత్తికి రూ.7,121 చెల్లిస్తోందన్నారు. తేమ శాతం 9 నుంచి 12శాతం వరకు ఉండేలా రైతులు తీసుకురావాలన్నారు. 8897281111 సెల్ నంబర్‌కు రైతులు చాటింగ్ చేసి వివరాలను తెలుసుకోవచ్చని, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, సీసీఐ కాటన్ పర్చేజ్ ఆఫీసర్ నర్సిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నెల్లుట్లలోని కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

## నేడు బచ్చన్నపేటలో బీఆర్ఎస్ నిరసన

బచ్చన్నపేట, అక్టోబర్ 19 : రైతులకు 'రైతు భరోసా' ఇవ్వలేమని స్వయంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడాన్ని బీఆర్ఎస్ తప్పుపట్టింది. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు చేపట్టే నిరసనకు మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, యూత్ నేతలు, అనుబంధ సంఘాల బాధ్యులు, మాజీ వార్డు సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## 'రైతు భరోసా' ఇవ్వని మంత్రి రాజీనామా చేయాలి

బచ్చన్నపేట, అక్టోబర్ 19 : 'రైతు భరోసా' ఇవ్వని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాజీనామా చేయాలని మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గందమల్ల నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ఇప్పట్లో రైతుభరోసా ఇవ్వలేమని స్వయంగా మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల పక్షాన నిలువాల్సిన ప్రభుత్వం ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ మండల నాయకులు మల్లారెడ్డి, షబ్బీర్, అనిల్‌రెడ్డి, జావీద్, వినోద్, కైసర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

## సింగరేణి పర్సనల్ మేనేజర్‌గా ఉదయ్‌కుమార్



రఘునాథపల్లి, అక్టోబర్ 19: మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ఉదయ్‌కుమార్ సింగరేణి సంస్థ పర్సనల్ మేనేజర్‌గా ఎంపికైనట్లు తల్లిదండ్రులు కొయ్యడ ప్రభాకర్, లక్ష్మి దంపతులు శనివారం తెలిపారు. ఉదయ్‌కుమార్ మండల కేంద్రంలో పదో తరగతి పూర్తి చేసి, ఘట్‌కేసర్ విజ్ఞాన భారతిలో బీటెక్ ఈఈఈలో ప్రథమ స్థానంలో నిలిచి, నిజాం కాలేజీలో ఎంబీఏ పూర్తిచేశాడని వివరించారు. తమ కుమారుడు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివే వాడని, దానికి ఫలితం దక్కడంతో దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు.



















